సాక్షి
మహబూబాబాద్
సోమవారం । 20 । మే । 2024



ఉప్పల్‌లో నిలిచిన రైళ్లు
హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో కాగజ్‌నగర్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండున్నర గంటల పాటు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. - 8లో▸



మార్కెట్ ఏరియాలో చోరీ
జనగామ పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని ఓ ఇంట్లో రూ.5లక్షల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణకు గురైంది. - 8లో▸



వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలు చోట్ల ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శం



నెహ్రూసెంటర్: పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం యువతకు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో సుందరయ్య 93వ వర్ధంతి సభ కార్యక్రమాన్ని సీపీఎం పట్టణకార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసిన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో పార్లమెంట్‌లో మాట్లాడి ప్రజల మనిషిగా నిలిచారని కొనియాడారు. పార్లమెంట్ సమావేశాలకు సైకిల్‌పై వెళ్లి రాజకీయ నాయకులకు సుందరయ్య ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారని పేర్కొన్నారు. సుందరయ్య ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, చీపిరి యాకయ్య, బానోత్ వెంకన్న, తోట శ్రీనివాస్, బూర్గుల లక్ష్మణ్, బానోత్ శ్రీరామ్, యమగాని వెంకన్న, విజయలక్ష్మి, ప్రియాంక పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్

విద్యారణ్యపురి: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాత పరీక్షలు ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో ఈనెల 20 నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించబోతున్నారు. అలాగే.. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో హనుమకొండలో నాలుగు పరీక్ష కేంద్రాలను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఈనెల 20, 21, 22, 24, 28, 29 తేదీల్లో పేపర్–2 పరీక్షలు, ఈనెల 30, 31, జూన్ 1, 2 తేదీల్లో పేపర్–1 పరీక్షలు నిర్వహిస్తారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో మొత్తంగా 15,949 మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నట్లు హనుమకొండలో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, ఎర్రగట్టు గుట్ట వద్ద ఐయాన్ డిజిటల్ జోన్, నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, మోక్షిత కంప్యూటర్స్‌లో పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. పరీక్షలు ఆయా తేదీల్లో రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2గంటల నుంచి 4:30 గంటల వరకు ఉంటుంది. నలుగురు అబ్జర్వర్లను సంబంధిత అధికారులు నియమించారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఇచ్చారు. పరీక్షల షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులకు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

హేమాచలుడి బ్రహ్మోత్సవాలు షురూ



మంగపేట: రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచిన ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల(జాతర) కార్యక్రమాలను యాగ్నికుల బృందం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభించింది. ఆనవాయితీ ప్రకారం ఆలయంలో ప్రతిఏటా స్వామివారికి 10రోజుల పాటు బ్రహ్మోత్సవాలు(జాతర), స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయ కార్యనిర్వహణ ఇన్‌చార్జ్ అధికారి శనిగల మహేష్ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలను భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది మురళీ కృష్ణమాచార్యుల శిష్య బృందం ఆదివారం ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ప్రధానాలయంలోని స్వయంభు మూలమూర్తుల వద్ద ఉత్సవ ఆజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి యాగశాలలో యాగ్నిక పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 9గంటలకు ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపానికి చేర్చి విష్వక్సేనపూజ, భగవత్ పుణ్యాహవచన, పరిషత్‌దక్షిణ, రక్షా బంధనం, రుత్విక్‌వరణం, నవకలశ స్నపనం, మహానివేదన, సాయంత్రం 5గంటలకు ఉత్సవాంగ స్నపనం, బాలబోగం, మహానివేదన కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మత్స్యంగ్రహణం, అంకురార్పన హోమంపూజాలు నిర్వహించారు.



పంపిణీపై నీలినీడలు

ఉచిత చేపపిల్లల అందజేతపై స్పష్టత కరువు
- ఇంకా ప్రభుత్వం నుంచి రాని ఆదేశాలు
- ఎదురు చూస్తున్న మత్స్యకారులు
- నగదు బదిలీ చేయాలని డిమాండ్





ఉచితంగా అందజేసిన చేప పిల్లలు (ఫైల్)

నెహ్రూసెంటర్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈమేరకు చెరువులు, కుంటల్లో పిల్లలను వదిలేందుకు ఏటా ఏప్రిల్ మాసంలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించేది. అయితే ప్రస్తుతం మే నెల వచ్చినప్పటికీ ఇంకా టెండర్లు పిలవకపోవడంతో పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో మత్స్యకారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ చేస్తారా.. లేదా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సందిగ్ధం...

జిల్లాలో చేప పిల్లల పంపిణీతో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగింది. ఎదిగిన చేపల విక్రయం ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి చేకూరింది. కాగా పిల్లల పంపిణీపై ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో అమలుపై సందిగ్ధం నెలకొంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తుందా లేదా అన్న సందేహాలు మత్స్యకారుల్లో తలెత్తుతున్నాయి. యథావిధిగా పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

గతేడాది 4 కోట్ల చేప పిల్లల పంపిణీ..

జిల్లా వ్యాప్తంగా గతేడాది 1,250 చెరువుల్లో సుమారు 4కోట్ల ఉచిత చేప పిల్లలను వదిలారు. చెరువుల్లో రెండు కోట్ల చిన్న చేపలు, రెండు కోట్ల పెద్ద చేప పిల్లలను వదిలేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. కాగా జిల్లాలో 200మత్స్య సహకార సంఘాలు ద్వారా 14వేల మంది మత్స్యకారులు, వారి కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి జరుగుతోంది. చేపలు పట్టడం, విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు.

అదును దాటి పంపిణీ..

జిల్లాలో ఏటా అదును దాటిన తర్వాత చేప పిల్లలను సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు పంపిణీ చేస్తున్నారు. దీంతో పిల్లలు ఎదగక తమకు మేలు జరగడం లేదని, ఆగస్టులోపు చెరువుల్లో వదిలితే బాగా ఎదిగిన చేపల విక్రయాలద్వారా ఆర్థిక లబ్ధి జరుగుతుందని మత్స్యకారులు కోరుతున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని, అది కూడా సక్రమంగా పూర్తిస్థాయిలో జరగడం లేదని ఆరోపిస్తున్నారు. కాగా ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది మత్స్యసహకార సంఘాలకు ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ పథకాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

నగదు బదిలీ చేయాలి



ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదును ప్రతి సొసైటీకి ఇవ్వాలి. దీంతో నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేసి సరైన సమయంలో చెరువుల్లో పోస్తాం. ఏడాది చివర్లో పిల్లలు ఇవ్వడం వల్ల ఎదగడం లేదు. ముందుగా మత్స్యకారులు పోసిన చేపలు పడుతుండగా ఉచిత చేప పిల్లలు ఇంకా పిల్లల దశలో ఉంటున్నాయి. నగదు అందించి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలి.

– పిల్లి దశరథం, సొసైటీ కార్యదర్శి, మహబూబాబాద్

పంపిణీని కొనసాగించాలి



ప్రతి ఏడాది మాదిరిగానే ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగించాలి. మత్స్యకారులకు చేయూతనందించేలా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఉంది. నాణ్యమైన చేప పిల్లలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ఏడాది ప్రారంభంలోనే చేప పిల్లలను అందించేలా ప్రభుత్వం, మత్స్యశాఖ అధికారులు చొరవ చూపాలి.

– మేకల సురేష్, మత్స్యకారుడు

చేప పిల్లల్లో ఎదుగుదల లేదు..



ప్రతి ఏడాది సెప్టెంబర్ నుంచి మొదలుకుని డిసెంబర్ వరకు చేప పిల్లల పంపిణీ చేపడుతున్నారు. ముందుగా మత్స్యకారులు పోసిన చేపలు చేతికి రాగా ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లల్లో ఎదుగుదల కనిపించడం లేదు. జూలైలోనే పిల్లలను చెరువుల్లో పోసి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం దోహదపడాలి.

– కృష్ణ, మత్స్యకారుడు

ఆదేశాలు వస్తే పంపిణీకి చర్యలు



ఉచిత చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతేడాదిలో ఏప్రిల్ నెలలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా సెప్టెంబర్, అక్టోబర్‌లో చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఆదేశాల వస్తే ఉచిత చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపడుతాం.

– నాగమణి, జిల్లా మత్స్యశాఖ అధికారి

పట్టభద్రుల ఓటు.. ఇలా వేయాలి

- విధానం తప్పితే ఓటు చెల్లదు



కాజీపేట సెంటర్ : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక ఓటింగ్ ఈ నెల 27న జరగనున్నది. మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించిన ఎలక్షన్ కమిషన్ ఓటు హక్కు కల్పించింది. అయితే సాధారణ ఎన్నిలు, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటింగ్‌లో తేడాలున్నాయి. చాలా మంది ఓటు వేసే విధానం తెలియక చేసే పొరపాట్లతో ఓటు మురిగిపోయే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈవీఎం, వీవీ ప్యాట్స్ ఉండవు. బ్యాలెట్ పేపర్ మాత్రమే ఉంటుంది. బ్యాలెట్‌ను జాగ్రత్తగా పరిశీలించి ఓటు వేయాల్సి ఉంటుంది. అది ఎలా వేయాలో ఒకసారి చూద్దాం..

ఓటింగ్ విధానం
- ఓటు వేయడానికి ఓటర్ స్లిప్, ఏదైనా ఒక ఐడీ కార్డ్ తీసుకెళ్లాలి.
- పోలింగ్ అధికారి బ్యాలెట్ పేపర్, పెన్ను ఇస్తారు. వాటినే ఉపయోగించాలి.
- బ్యాలెట్ పేపర్‌లో పోటీ చేసిన అభ్యర్థుల పేరు, పార్టీ, పక్కన బాక్స్ ఉంటాయి.
- ఎంత మంది పోటీచేస్తే అందరివి ఉంటాయి.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో 1,2,3,4,... ఇలా ప్రాధాన్యత క్రమంలో కేటాయించాలి.
- మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రం తప్పక వేయాలి(1)
- ఒక్కరికీ ఓటు వేయవచ్చు లేదా కొంతమందికి లేదా అందరికీ వేయవచ్చు. అది మన ఇష్టం. కానీ ప్రాధాన్యత తప్పవద్దు.

ప్రాధాన్యత ఎలాగో చూద్దాం..

ఉదాహరణకు.. మొత్తం 70 మంది అభ్యర్థులు ఉన్నారు. ఆరుగురికి మాత్రమే ఓటు వేద్దామనుకుంటే.. బ్యాలెట్ పేపర్ పరిశీలించి అందులో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలనుకుంటే ఫొటో ఎదురుగా ఉన్న బాక్స్‌లో 1 నంబర్ రాయాలి. మిగతా ఎంచుకున్న ఐదుగురి ఫొటోల ఎదురుగా ఉన్న బాక్సుల్లో 2,3,4,5,6 నంబర్లు రాయాలి. ఒక వేల 1,2,3 నంబర్లు వేసిన తర్వాత 4వ నంబర్ మిస్ చేసి ఐదో నంబర్ వేస్తే ఆ ఓటు చెల్లదు. 1వ నంబర్ వదిలేసి మిగతా 2,3,4,5,6 నంబర్లు వేసినా ఆ ఓటు చెల్లుబాటు కాదు. బ్యాలెట్ పేపర్‌పై రోమన్ అంకెలను రాయకూడదు. ఒకటి, రెండు..అని తెలుగులో కూడా రాయవద్దు. రైట్ మార్క్ లాగా టిక్ చేయవద్దు. ఎక్కడా సంతకం పెట్టొద్దు.

టీఎస్‌ఈఏపీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: టీఎస్ ఈఏపీసెట్ ఫలితాల్లో కేజీబీవీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని డీఈఓ పి.రామారావు తెలిపారు. ఈఏపీసెట్‌లో ఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థినులను ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అభినంధించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. మానుకోట మట్టిలో మాణిక్యాలు ఉన్నారని, వారికి కావాల్సిన ప్రోత్సాహం అందిస్తే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారన్నారు. డోర్నకల్ కేజీబీవీ విద్యార్థినులు ఇ.మల్లేశ్వరి, బి.పూజిత, మహబూబాబాద్ కేజీబీవీ విద్యార్థిని సీహెచ్.సుశాంతి, గార్ల, గూడూరు కేజీబీవీ విద్యార్థినులు బి.నిఖిత, ఎన్.ప్రియ ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీఈసీఓ జి. విజయకుమారి, కేజీబీవీల ప్రత్యేక అధికారులు ఉషారాణి, పీజీసీఆర్టీ మంజుల, యాకలక్ష్మి, సీఆర్టీ శ్రీదేవి, తల్లిదండ్రులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఎక్కడ చదవాలి?

- జిల్లాలోని 7 కేజీబీవీల్లో లేని ఇంటర్మీడియట్ విద్య
- పదో తరగతిలో మెరుగైన ఫలితాలు
- ఇంటర్ అవకాశం లేకపోవడంతో 219మంది విద్యార్థినుల ఆందోళన



ఇంటర్మీడియట్ లేని తొర్రూరు కేజీబీవీ

మహబూబాబాద్ అర్బన్: కస్తూర్బాగాంధీ విద్యాలయాలు బాలికలకు వరంగా మారాయి. చదువు మధ్యలో మానేసినవారు, ఆర్థికస్థోమత లేని బాలికలకు బాసటగా నిలుస్తున్నాయి. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ కేజీబీవీల క్రేజ్‌ను పెంచుతున్నారు. కాగా జిల్లాలో 15 కేబీబీవీలు ఉండగా 8 పాఠశాలల్లో ఇంటర్ విద్య ఉంది. 7విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ లేదు. దీంతో ఆయా పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు పైచదువులపై ఆందోళన చెందుతున్నారు.

3,388 మంది విద్యాభ్యాసం..

జిల్లాలో 15 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 3,888మంది విద్యార్థినులు పది, ఇంటర్ చదువుతున్నారు. అందులో 8 కేజీబీవీల్లో ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మరో 7కేజీబీవీలు అప్‌గ్రేడ్ కాకపోవడంతో పదో తరగతి వరకు పాఠాలు బోధిస్తున్నారు. కాగా ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 480 మంది విద్యార్థినులకు 454మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా ఇంటర్ అప్‌గ్రేడ్ కాని 7పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తీర్ణత సాధించిన 219మంది విద్యార్థినులు ఎక్కడ చదవాల్లో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. అందరూ పేద విద్యార్థినులే కావడంతో ప్రైవేట్ కళాశాలల్లో చదివే స్థోమత లేదు. కాగా మిగిలిన పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్య అందించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఆందోళన అవసరం లేదు..



జిల్లాలో 2017లో మొదటిసారిగా పలు కేజీబీవీలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఒక్కో సంవత్సరంలో ఒక్కో పాఠశాలలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. ఈ ఏడాది నర్సింహులపేట కేజీబీవీ అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదన పంపించాం. పదో తరగతి పాసైన కేజీబీవీ విద్యార్థినులు ఆందోళన చెందాల్సి అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేని కేజీబీవీలో చదివిన విద్యార్థినులు మరో కేజీబీవీలో ఇంటర్ చదివేందుకు మొదటి అవకాశం కల్పించి అడ్మిషన్లు ఇస్తాం.

–గుండ్ల విజయకుమారి, జీసీడీఓ, మహబూబాబాద్

కేజీబీవీ టెన్త్ విద్యార్థినుల ఫలితాలు

కేజీబీవీ	విద్యార్థినుల సంఖ్య	ఫెయిల్	పాస్	ఉత్తీర్ణత శాతం
బయ్యారం	30	–	30	100
చిన్నగూడూరు	38	–	38	100
డోర్నకల్	42	4	38	90.47
గంగారం	37	–	37	100
గార్ల	27	5	22	81
గూడూరు	23	1	22	96
కేసముద్రం	27	3	24	89
కొత్తగూడ	31	–	31	100
కురవి	30	2	28	93
మహబూబాబాద్	34	–	34	100
మరిపెడ	28	1	27	96
నర్సింహులపేట	25	1	24	96
నెల్లికుదురు	39	–	39	100
పెద్దవంగర	38	–	38	100
తొర్రూరు	31	9	22	70.96
మొత్తం	480	26	454	94.58

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి

గార్ల: పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఆదివారం గార్లలోని పాకాల ఏటి చెక్‌డ్యామ్ వరద ఉధృతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. దశాబ్దాల కాలంగా పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంలో పాలకులు, అధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. పలుమార్లు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదన్నారు. బ్రిడ్జి లేకపోవడంతో విద్యార్థులు రైల్వే బ్రిడ్జి పైనుంచి బిక్కుబిక్కుమని నడుచుకుంటూ చదువుల కోసం గార్లలోని పాఠశాలలకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు.

కూరగాయల వ్యాపారుల కష్టాలు

- పునాదులకే పరిమితమైన శాశ్వత భవన సముదాయం
- కోర్టులో కొనసాగుతున్న కేసు
- రోడ్లమీదనే విక్రయాలతో తప్పని తిప్పలు



రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు

డోర్నకల్: కూరగాయల వ్యాపారులు శాశ్వత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ గాంధీ సెంటర్‌లో కూరగాయలు, పండ్లు, మాంసం వ్యాపారులు కోసం శాశ్వత భవనాల నిర్మాణాల కోసం పాత భవనాలను కూల్చివేశారు. భవనాల కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయగా.. 2019 జూన్ 12న అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎంపీ మాలోత్ కవిత భవన నిర్మాణ పనులకు శంకుపన చేశారు. పునాదుల వరకు పనులు చేపట్టిన తర్వాత పలు కారణాల వల్ల నిలిపివేశారు. దీంతో వ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు జరుపుతూ ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు ఆదేశించినా..

కలెక్టర్ స్థాయి అధికారులు పలుమార్లు కూరగాయల మార్కెట్ సందర్శించి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఇదే సమయంలో కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో నిలిచాయి. ఐదేళ్ల పూర్తవుతున్నా అధికారులు, మున్సిపాలిటీ పాలకవర్గం నిర్మాణంపై దృష్టి సారించకపోవడంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పునాదుల్లోనే నిలిచిన పనులు

రోడ్లపైనే విక్రయాలు..

గాంధీ సెంటర్‌లో రోడ్డు పక్కన తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కొంతమంది రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎండ, వానలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ వ్యాపారాలు చేయలేకపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. అధికారులు, పాలకవర్గం స్పందించి కోర్టు కేసు పరిష్కారంపై దృష్టి సారించి భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని వ్యాపారులు కోరుతున్నారు.

భద్రకాళీ అమ్మవారికి వాహన సేవలు



హన్మకొండ కల్చరల్ : కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీభద్రకాళి దేవాలయంలో ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి మూలమూర్తిని అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యాన వేదపండితులు భద్రకాళీ దేవికి ఉదయం శరభవాహనసేవ, రాత్రి పుష్పరథసేవలు వైభవంగా నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలకు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం, జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, చొల్లేటి కృష్ణమాచారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెల్ల విఠలాచార్యులు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, అలుగోజు కృష్ణమూర్తిహరినాథ్, వీణవంక సదానందం, విష్ణువర్ధన్, కొక్కొండ రాజేంద్రప్రసాద్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్ పార్టీనే గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని శ్రీనివాస గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న తీన్మార్ మల్లన్న, ప్రేమేందర్ రెడ్డి నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయులు, మేధవుల పక్షాన పోరాటం చేయలేరని, ఎలాంటి నేర చరిత్రలేని, నిత్యం ప్రజా సేవ చేస్తున్న విద్యావంతుడు, మేధావి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈనెల 22న తొర్రూరులో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార బహిరంగ సభకు పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నారని, పాలకుర్తి నియోజకవర్గంలోని పట్టభద్రులు వచ్చేవిధంగా కార్యకర్తలు కృషి చేసి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

మహబూబాబాద్: వరంగల్– ఖమ్మం– నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 20నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 27న ఉప ఎన్నిక పోలింగ్ ఉన్నందున తగు ఏర్పాట్లు చేశామన్నారు.

క్లుప్తంగా

వీరస్వామికి తెలుగు బుక్‌ ఆఫ్‌ అవార్డు


అవార్డు చూపుతున్న డాక్టర్‌ వీరస్వామి

ఖిలా వరంగల్‌: వరంగల్‌ తూర్పు కోటకు చెందిన ఏవీఎస్‌ విద్యాసంస్థల అధినేత, సామాజిక వేత డాక్టర్‌ అంకతి వీరస్వామి ఆదివారం సికింద్రాబాద్‌లోని సౌత్‌ సెంట్రల్‌ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రైల్వే అధికారుల చేతుల మీదుగా ప్రతిష్టాత్మక తెలుగు బుక్‌ ఆఫ్‌ అవార్డు అందుకున్నారు. 80 ఏళ్ల వయసులో నిత్య విద్యార్థిగా 21 మాస్టర్‌ డిగ్రీలతోపాటు డాక్టరేట్‌ పొందిన వీరస్వామికి ఈ అవార్డు అందజేశారు. గతంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన సమయంలో బుర్ర కథ, రేడియో, దూరదర్శన్‌, ఆర్టిస్ట్‌గా పనిచేసి రాష్ట్ర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా అనేక ప్రశంసలు అందుకున్నారు. కాగా, అవార్డు అందుకున్నందుకు తనకు గర్వంగా ఉందని వీరస్వామి పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


కొమురయ్య(ఫైల్‌)

నడికూడ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని కంఠాత్మకూర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కంఠాత్మకూర్‌ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుడికందుల కొమురయ్య(59) ఇదే గ్రామానికి చెందిన రమేశ్‌ నిర్మిస్తున్న ఇంటి పనులకు కూలీగా వెళ్తున్నాడు. ఆదివారం పనికి వెళ్లి వచ్చిన తర్వాత, సాయంత్రం రమేశ్‌ వాటర్‌ మోటార్‌ కోసం అదనంగా విద్యుత్‌ కనెక్షన్‌ ఇవ్వాలని పిలిచాడు. విద్యుత్‌ తీగ సరిచేస్తుండగా మరో వైరు కొమురయ్యకు తగిలింది. దీంతో విద్యుత్‌ సరఫరా కాగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

లింగాలఘణపురం : మండలంలోని నేలపోగుల గ్రామానికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వడ్లకొండ పెంటయ్యపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. కిరాణ షాపునకు వెళ్లిన సదరు బాలికపై పెంటయ్య ఉమ్మి వేయడమే కాకుండా దుర్భాషలాడినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

కోడి పందెం స్థావరాలపై దాడి

గణపురం: మండల కేంద్రంలో కొనసాగుతున్న కోడి పందెం స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఇందులో 3 కోడి పుంజులు, 2 కత్తులు స్వాధీనం చేసుకుని 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

రేషన్‌ బియ్యం స్వాధీనం

భూపాలపల్లి అర్బన్‌ : భూపాలపల్లి పట్టణంలో శనివారం రాత్రి పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నరేష్‌కుమార్‌ తెలిపారు. పట్టణంలోని పోచమ్మగుడి సమీపంలో రోడ్డు పక్కన డీసీఎం నిలిపి అనుమానస్పదంగా కనిపించడంతో పెట్రోలింగ్‌ చేస్తున్న ఎస్సై సుధాకర్‌ తనిఖీ చేశారు. ఇందులో పరకాల ఏరియా నుంచి 50 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. డ్రైవర్‌ సుంకరి రవీందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కె. సంపత్‌ సాయంతో సిరొంచకు రేషన్‌ బియ్యం తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. వాహనాన్ని సీజ్‌ చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఉప్పల్‌లో నిలిచిపోయిన రైళ్లు


ఉప్పల్‌ రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన కాగజ్‌నగర్‌, నవజీవన్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు


స్టేషన్‌ మాస్టర్‌తో వాగ్వాదం చేస్తున్న ప్రయాణికులు

- రైల్వే స్టేషన్‌ మాస్టర్‌తో ప్రయాణికుల వాగ్వాదం
- రెండున్నర గంటల తర్వాత వెళ్లిపోయిన ఎక్స్‌ప్రెస్‌ ట్రైన్లు

కమలాపూర్‌: హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలం ఉప్పల్‌ రైల్వేస్టేషన్‌లో ఆదివారం కాగజ్‌నగర్‌ ఎక్స్‌ప్రెస్‌, నవజీవన్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు రెండున్నర గంటల పాటు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేషన్‌ మాస్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న కాగజ్‌నగర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో ఉప్పల్‌ రైల్వే స్టేషన్‌కు చేరుకోగా అక్కడే నిలిపివేశారు. మరో అరగంట తర్వాత జనరేటర్‌ వ్యాన్‌లో సాంకేతిక కారణాలతో వచ్చిన నవజీవన్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలును సైతం ఇక్కడే నిలిపారు. రెండు రైళ్లు రెండు గంటలకు పైగా నిలిచిపోవడంతో ఓపిక నశించిన ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేషన్‌ మాస్టర్‌తో వాగ్వాదానికి దిగారు. చివరకు రెండున్నర గంటల తర్వాత కాగజ్‌నగర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు ఇంజన్‌ను నవజీవన్‌ ఎక్స్‌ప్రెస్‌కు, నవజీవన్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు ఇంజన్‌ను కాగజ్‌నగర్‌ ఎక్స్‌ప్రెస్‌కు అమర్చి రెండు రైళ్లను పంపించి వేశారు. కాగా ఆయా రైళ్లల్లో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు రైల్వే ఉన్నతాధికారులకు ట్విట్టర్‌ ద్వారా ఫిర్యాదు చేయగా రైల్వే అధికారులు పవర్‌ ప్రాబ్లం అంటూ దాటవేసే సమాధానం ఇచ్చారని, ఇది రైల్వే అధికారుల నిర్లక్ష్యమేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రీడా బకాయిల చెల్లింపునకు కృషి


- ఖోఖో సంఘం అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి


రాఘవరెడ్డి, శ్యాంను సన్మానిస్తున్న ఒలింపిక్స్‌, ఖోఖో సంఘం ప్రతినిధులు

వరంగల్‌ స్పోర్ట్స్‌: గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్‌ సర్కార్‌ క్రీడాకారుల సంక్షేమం, అభ్యున్నతిని పూర్తిగా విస్మరించింది.. పెండింగ్‌లో ఉన్న క్రీడల బకాయిల అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే చెల్లించేలా కృషి చేస్తానని ఖోఖో అసోసియేషన్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్‌ ఆఫీసర్స్‌ క్లబ్‌లో ఆదివారం ఖోఖో అసోసియేషన్‌ సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరిగాయి. కార్యవర్గంలోని అన్ని పోస్టులకు ఒక్కో నామినేషన్‌ మాత్రమే రావడంతో ఎన్నికను ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి మహ్మద్‌ కరీం తెలిపారు. అధ్యక్షుడిగా జంగా రాఘవరెడ్డి, కార్యదర్శిగా తోట శ్యాంప్రసాద్‌, కోశాధికారిగా గట్టుకొప్పుల ప్రసాద్‌, ఉపాధ్యక్షులుగా కత్తి కుమారస్వామి, కుసుమ సదానందం, ఎం.శ్యాంసుందర్‌, పి.నరేందర్‌గౌడ్‌, జి.మల్లయ్య, ఎస్‌.చందర్‌, ఎస్‌.కుమారస్వామి, సీహెచ్‌.రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రమణ, కోట రాంబాబు, ఎ.శ్రీనివాస్‌, జి.సదానందం, రాజా రపు రమేష్‌, వీరగోని స్వప్న, జి.సునీత, జి.సుదర్శన్‌, బొజ్జం రంజిత్‌, కార్యవర్గ సభ్యులుగా జి.లక్ష్మీనారాయణ, ఎల్‌.నాగరాజు, ఎడ్ల రాజు, ఇ.రాజేందర్‌ ఎన్నికైనట్లు తెలిపారు. అసోసియేషన్‌ రాష్ట్ర బాధ్యులు జీపీ విలియమ్స్‌, కృష్ణమూర్తి, హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్‌ శ్రీమన్నారాయణ, మహబూబాబాద్‌ డీవైఎస్‌ఓ అనిల్‌కుమార్‌, వరంగల్‌ ఒలింపిక్స్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి బి.కైలాస్‌యాదవ్‌ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు ఆటతీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. సంఘంలో భేదాభిప్రాయాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, సంఘం ప్రతిష్టను దెబ్బతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. వరంగల్‌ ఒలింపిక్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్‌ మాట్లాడుతూ ఖోఖో క్రీడకు జంగా రాఘవరెడ్డి సేవలు అభినందనీయమన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా క్రీడాకారుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు.

సీటు.. ఫైటు

- ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల గొడవ


దాడిలో గాయపడిన శేఖర్‌

నెహ్రూసెంటర్‌: ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం ఒకరిపై ఒకరు చేయి చేసుకున్న సంఘటన మహబూబాబాద్‌ డిపోలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన కొందరు నర్సంపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం టవల్‌ వేశారు. మరికొందరు తామే ముందు కర్చీఫ్‌ వేశామంటూ గొడవకు దిగారు. ఇరు వర్గాలకు మధ్య వాగ్వాదం పెరిగి చేయిచేసుకునే స్థితికి చేరింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన ఆర్టీసీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం.

గ్రేయిన్‌ మార్కెట్‌ ఏరియాలో చోరీ

- రూ.5 లక్షల నగదు, 4 తులాల బంగారం అపహరణ

జనగామ: జనగామ గ్రేయిన్‌ మార్కెట్‌ ఏరియాలోని ఓ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఈ ఘటన రూ.5లక్షల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణకు గురైంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మార్కెట్‌ ఏరియాకు చెందిన గొల్లపల్లి వెంకటేశ్‌ సతీమణి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇంటికి తాళం వేసి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు చేయించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడం, బీరువా పగులగొట్టి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై భరత్‌ ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బతుకుభారమై.. బలవన్మరణం

వివిధ కారణాలతో మనస్తాపం చెంది.. బతుకుభారంగా భావించిన నలుగురు.. ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని పరకాల మండలం పోచారంలో వివాహిత, జనగామ పట్టణంలో వ్యక్తి, కాజీపేట 63వ డివిజన్‌ తిలక్‌నగర్‌ కాలనీలో యువకుడు, ములుగు మండలంలోని శ్రీనగర్‌ పంచాయతీ పరిధి మల్లారెడ్డిపల్లిలో మరో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. –సాక్షి నెట్‌వర్క్‌


జ్యోతి(ఫైల్‌)

పరకాల: అదనపు కట్నం వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం పరకాల మండలం పోచారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన జ్యోతి(26)ని 2022 మార్చి 27న పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన జూపాక ప్రశాంత్‌కు ఇచ్చి వివాహం జరిపారు. ఈ సమయంలో కట్నంగా రూ.3లక్షల 50వేలు అందజేశారు. అయితే పెళ్లయిన ఏడాదికే అదనపు కట్నం కోసం ప్రశాంత్‌తో పాటు అతడి తల్లిదండ్రులు అహల్య, రవి వేధింపులకు పాల్పడడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అదనపు కట్నంతోపాటు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా వచ్చిన రూ.లక్ష ఇవ్వాలంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ వేధింపులు భరించలేక జ్యోతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఏసీపీ కిశోర్‌కుమార్‌, సీఐ రవిరాజ్‌ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రవిరాజు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..



ప్రభాకర్‌ మృతదేహం

జనగామ : జనగామ పట్టణం సంజయ్‌నగర్‌కు చెందిన ఉల్లెంగుల ప్రభాకర్‌(51)శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సృజన్‌ ఆదివారం తెలిపారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ప్రభాకర్‌.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపానికి గురై కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

మనస్తాపంతో యువకుడు..

కాజీపేట : కాజీపేట 63వ డివిజన్‌ తిలక్‌నగర్‌ కాలనీకి చెందిన సింగారపు రాజశేఖర్‌(30) పెళ్లికావడం లేదనే కారణంతో మనస్తాపానికి గురై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సుధాకర్‌ రెడ్డి తెలి పారు. సీఐ కథనం ప్రకారం.. ఆటో నడుపుకుంటూ తన అక్కతో కలిసి ఉంటున్న రాజశేఖర్‌ కొద్దిరోజులుగా వివాహం విషయంలో ఆందోళనకు గురవుతున్నాడు. సంబంధాలు ఎక్కడా చూసిన కుదరకపోవడంతో ఆవేదనకు లోనవుతున్నాడు. ఆదివారం ఉదయం సోమిడి శివారులో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి అక్క రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పురుగుల మందుతాగి యువకుడు..


విష్ణువర్ధన్‌రెడ్డి(ఫైల్‌)

ములుగు రూరల్‌ : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన ఆదివారం ములుగు మండలం శ్రీనగర్‌ పంచాయతీ పరిధి మల్లారెడ్డిపల్లిలో జరిగింది. మల్లారెడ్డిపల్లికి చెందిన చెరుకుపల్లి సాంబశివరెడ్డి చిన్న కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి(20) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు మల్లంపల్లిలో ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. ఈ విషయంపై ములుగు ఎస్సైని వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేదన్నారు. విష్ణువర్ధన్‌ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రేపు 'అనురాగ దీపం' నవల ఆవిష్కరణ


అనురాగదీపం నవల కవర్‌పేజీ

విద్యారణ్యపురి : అంపశయ్య నవీన్‌ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ నవల రచయిత డాక్టర్‌ అంపశయ్య నవీన్‌ సతీమణి అనుసూయ ప్రథమ వర్ధంతి సభ హనుమకొండలోని పాపడమ్‌ బ్లూ బాంక్వెట్‌ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారని ట్రస్టు కార్యదర్శి డి. స్వప్న ఆదివారం తెలిపారు. తన ఆరు పదుల దాంపత్య జీవితాన్ని చిత్రిస్తూ నవీన్‌ రచించిన అనురాగ దీపం నవల ఆవిష్కరణ కార్యక్రమం కూడా జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షుడిగా ప్రముఖ రచయిత, విమర్శకులు గిరిజా మనోహరబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గంటా రామిరెడ్డి నవలను ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి నవలను పరిచయం చేస్తారు. వక్తలుగా అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ వద్దానం వాసు, ఆచార్య బన్న అయిలయ్య, అమ్మంగ వేణుగోపాల్‌, కె.వరలక్ష్మితోపాటు తదితరులు పాల్గొంటారు. కవులు , సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొనాలని స్వప్న కోరారు.

రేషన్‌ షాపులు సీజ్‌

- డీలర్‌కు రూ. 1. 82 లక్షల జరిమానా

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి, కాట్రపల్లి గ్రామాల్లోని రేషన్‌షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా బియ్యం నిల్వల్లో తేడాలు రావడంతో సివిల్‌ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించారు. ఇందులో తేడాలు ఉండడంతో 46 క్వింటాళ్ల 91 కిలోల బియ్యంపై కిలోకు రూ. 39 చొప్పున జరిమానా విధించినట్లు సివిల్‌ సప్లై డీటీ సత్యనారాయణ తెలిపారు. కాట్రపల్లి రేషన్‌ డీలర్‌ వాంకుడోతు శంకర్‌ నేరేడుపల్లి షాపునకు ఇన్‌చార్జ్‌ గా పని చేస్తున్నారు. అధికారులు ఈ రెండు రేషన్‌ షాపులపై దాడులు నిర్వహించగా బియ్యం నిల్వల్లో తేడా రావడంతో సివిల్‌ సప్లై అధికారులకు సమాచారం అందించారు. సివిల్‌ సప్లై డీటీ సత్యనారాయణ రావు సందర్శించి ఏఆర్‌ఐ హుస్సేన్‌ సమక్షంలో రెండు షాపులు సీజ్‌ చేసి కొప్పుల డీలర్‌ సామల మల్లయ్యకు తాత్కాలిక ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. శంకర్‌కు రూ. లక్ష 82వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్‌ : పడమరకోటకు చెందిన అలేఖ్య ఆదివారం అదృశ్యమైంది. తల్లిదండ్రులు నిద్ర నుంచి లేవక ముందే యువతి ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంత్రం వరకూ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి శ్రీనివాస్‌ ఆదివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగ, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్‌ తెలిపారు

సీపీకి కృతజ్ఞతలు..!

- కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించారు
- హరిహర ఎస్టేట్‌ ఓనర్స్‌(అపర్ణ)కాలనీ వాసుల వెల్లడి


సీపీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాలనీవాసులు

గీసుకొండ: గ్రేటర్‌ వరంగల్‌ 15వ డివిజన్‌ గొర్రెకుంట శివారులోని హరిహర ఎస్టేట్‌ ఓనర్స్‌(అపర్ణ కాలనీ వాసులు) ఆదివారం వరంగల్‌ పోలీసు కమిషనర్‌ అంబర్‌కిశోర్‌ ఝా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కబ్జాదారుల నుంచి తమకు రక్షణ కల్పించి వారిపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేశారని, ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేమంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం 'కుడా' లేఅవుట్‌ చేసిన 158 సర్వే నంబర్‌లోని ప్లాట్లు కొనుగోలు చేశామని, వాటిలో కొందరు ఇళ్లు నిర్మించుకోగా కబ్జాదారులు కొన్నేళ్లుగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. తమ నిర్మాణాలు, ప్రహరీలు, హద్దు రాళ్లను ధ్వంసం చేసి ఆస్తినష్టం కలిగించారన్నారు. గతేడాది డిసెంబర్‌ 15న కాలనీలో చొరబడి యథేచ్ఛగా కూల్చివేతలకు పాల్పడ్డారని, ఆ మరుసటి రోజు తాము సీపీని కలిసి తమ గోడు విన్నవించామన్నారు. దీంతో ఆయన టాస్క్‌ఫోర్స్‌ అధికారులకు కేసు అప్పగించడంతో కొన్ని రోజుల పాటు ఇరు వర్గాల పత్రాలను పరిశీలించి వాదనలను విని తమకు న్యాయం చేశారన్నారు. ఆక్రమణకు పాల్పడిన 12 మందిపై ఇటీవల గీసుకొండ పీఎస్‌లో కేసు నమోదు చేశారన్నారు. దీంతో తాము కాలనీలో ప్రశాంతంగా ఉంటున్నామన్నారు. ఈ సందర్భంగా వారు ఈస్ట్‌జోన్‌ డీసీపీ రవీందర్‌, టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ మధుసూదన్‌, ఇన్‌స్పెక్టర్లు దేవేందర్‌, దయాకర్‌, గీసుకొండ సీఐ ఎల్‌. పవన్‌కుమార్‌, మామునూరు ఏసీపీ తిరుపతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మణికంటి శ్రీరాంరెడ్డి, మేకల దేవేందర్‌, గద్దల అశోక్‌, గుగులోత్‌ బాలాజీ, కోమండ్ల ప్రభాకర్‌రెడ్డి, పల్లెపాటి సమ్మిరెడ్డి, మాచినేని సురేశ్‌, ఇప్పకాయల సమ్మయ్య, మేరుగు నారాయణ, మాత్రుపెల్లి అరవింద్‌, జాటోత్‌ హుస్సేన్‌, గాసికొండ కిరణ్‌కుమార్‌, ఆడ్రా భగవాన్‌రెడ్డి, అరిగెల రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం పాత్ర

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

నయీంనగర్‌ : దేశంలో బీజేపీ చేసిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను చూసి తనకు ఓటు వేసి గెలిపించాలని వరంగల్‌, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండ ప్రెస్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'మీట్‌ ది ప్రెస్‌'లో ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకున్నా తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేల కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. తాను వరంగల్‌ బిడ్డనని, అధికారం లేకున్నా పార్టీ మారలేదని, నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేశానన్నారు. వరంగల్‌లో బీజేపీకి ఎంపీ, ఎమ్మెల్యేలు లేకున్నా అభివృద్ధికి నిధులు ఇచ్చిన విషయం గ్రహించాలన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ తప్పుడు ప్రచారం చేస్తోందని కశ్మీర్‌లో బీజేపీ నిర్ణయంతోనే రిజర్వేషన్లు వచ్చాయన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థికి ఓటు వేస్తే పార్టీలో ఉండడని, పార్లమెంట్‌ ఎన్నికల తరువాత ఆ పార్టీలో ఎవరు ఉండరన్నారు. ప్రజలు బీజేపీని ఆదరించినందుకు కృతజ్ఞతలని, ఒక్కసారి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రెస్‌ క్లబ్‌ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్‌, జర్నలిస్ట్‌ సంఘాల నాయకులు గడ్డం రాజిరెడ్డి, గాడిపెల్లి మధు, దయాసాగర్‌, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు
- బుద్దారంలో ఘటన



అశోక్‌ (ఫైల్‌)

గార్ల: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి బుద్దారం రైల్వే అండర్‌ బ్రిడ్జి సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల మండలం వెంకటాపురం తండాకు చెందిన ఇస్లావత్‌ అశోక్‌(37) గార్ల నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఇల్లెందు మండలం కొమరారం గ్రామానికి చెందిన భాస్కర్‌.. తన భార్య సునీత, కూతురు అక్షితతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బుద్దారం రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇస్లావత్‌ అశోక్‌ తీవ్ర గాయం కావడంతో గార్ల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. భాస్కర్‌, అతడి కూతురు అక్షితకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో మహబూబాబాద్‌ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు అశోక్‌కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉంది. కాగా, ఆసుపత్రిలో అశోక్‌ మృతదేహం పై పడి భార్య, కుటుంబీకులు రోదించిన తీరు ప్రతీ ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

డాక్టర్‌ ఉంటే అశోక్‌ బతికేవాడు..

ఆసుపత్రిలో డాక్టర్‌ ఉంటే అశోక్‌ బతికేవాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గంటపాటు మృతదేహాన్ని ఆసుపత్రి ఎదుట పెట్టి ధర్నా నిర్వహించారు. ఘటనా స్థలి నుంచి ఆసుపత్రికి తీసుకొచ్చిన సమయంలో అశోక్‌ కొన ఊపిరితో ఉన్నాడు. ప్లాంటు ఉన్నా ఆసుపత్రికి ఆక్సిజన్‌ సౌకర్యం లేదు. పేరుకే పెద్దాసుపత్రి కాని రాత్రి సమయంలో ఒక్క డాక్టర్‌ కూడా ఉండడని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌ స్పందించి ఆసుపత్రిలో నైట్‌ డ్యూటీ డాక్టర్‌ను నియమించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్‌ చేశారు.

జనగామలో వృద్ధురాలు..


రాజమ్మ మృతదేహం

జనగామ: జనగామ ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. జనగామ మండలం పెద్దపహాడ్‌కు చెందిన అల్వాల రాజమ్మ(71) పని నిమిత్తం జనగామకు వచ్చారు. శ్రీరామ్‌ హోటల్‌లో ఛాయ్‌ తాగి గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మహమ్మద్‌ అమీర్‌ సోహెల్‌ ద్విచక్రవాహనంపై చౌరస్తా నుంచి నెహ్రూపార్క్‌ వైపునకు వెళ్తూ రాజమ్మను ఢీకొన్నాడు. దీంతో రాజమ్మ తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు రాజమ్మను వెంటనే 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, జనగామ పట్టణంలో రాత్రి 9 గంటల తర్వాత నెహ్రూపార్కు నుంచి సూర్యాపేట రోడ్డు మీదుగా తిరిగి అక్కడికే పలువురు యువకులు బైక్‌ రేసింగ్‌ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అయినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద సైలెన్సర్‌ శబ్దాలతో రేసింగ్‌ చేసే ప్రాంతంలో డీసీపీ కార్యాలయం ఉండడం గమనార్హం.

వనదేవతల స్థలం లాక్కునే ప్రయత్నం


సమావేశంలో పాల్గొన్న పూజారులు

- విరమించుకోకుంటే ఆందోళన
- మేడారంలో పూజారుల తీర్మానం

ఎస్‌ఎస్‌ తాడ్వాయి : వరంగల్‌లో మేడారం సమ్మక్క, సారలమ్మకు కేటాయించిన స్థలాన్ని భద్రకాళి దేవస్థాన అధికారులు లాక్కునే ప్రయత్నం విరమించుకోవాలని సమ్మక్క, సారలమ్మ పూజారులు డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో ఈనెల 29, 30 తేదీల్లో వనదేవతల దర్శనం నిలిపివేసి ఆలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం మేడారంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితం వరంగల్‌ ఎంజీఎం సమీపంలో 1000 గజాల స్థలం మేడారం సమ్మక్క సారలమ్మ పేరుమీద కేటాయించారన్నారు. ఆ స్థలంలో ఇటీవల మేడారం, మెట్టుగుట్ట, భద్రకాళి దేవస్థాన అధికారులు రూ. కోటి కేటాయించి రూ.3 కోట్లతో భవన నిర్మించారు. ఆ భవనంలో కొనసాగుతున్న మేడారం కార్యాలయాన్ని ఖాళీ చేయాలని భద్రకాళి దేవస్థాన అధికారులు ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా పైరవీలు చేయించి డిప్యూటీ కమిషనర్‌, మేడారం ఈఓ, అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. ఈ విషయంపై నెల రోజుల క్రితం మంత్రి సీతక్క, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అవసరమైతే మెట్టుగుట్ట, భద్రకాళి దేవస్థానం భవన నిర్మాణానికి కేటాయించిన రూ.2 కోట్లు తిరిగి చెల్లిస్తామని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా భద్రకాళి దేవస్థానం అధికారులు అమ్మవార్ల స్థలాన్ని వారి ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. సమావేశంలో పూజారులు కాక సారయ్య, కాక కిరణ్‌, భుజంగారావు, కాక వెంకటేశ్వర్లు, సిద్దబోయిన మునీందర్‌, గోపాల్‌రావు, క్రిష్ణయ్య, రమేశ్‌, నితిన్‌, స్వామి, మహేశ్‌, జనార్దన్‌, అనిల్‌, అరుణ్‌, చందా రఘుపతి, గణేశ్‌, కల్యాణ్‌, గోవిందరాజు, పగిడిద్దరాజుల పూజారులు దబ్బగట్ల జనార్దన్‌, పెనుక రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌, తదితరులు పాల్గొన్నారు.